సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 17 । మే । 2023



రాజరికానికి దర్పణం.. చరిత్రకు సాక్ష్యం
చారిత్రాత్మక ప్రదేశం గుర్రంకొండ కోట. రాచరికానికి, నవాబులు, బ్రిటిష్ వారి పాలనకు నిలువుటద్దంగా నిలుస్తోంది. -8లో..



ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా
ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ గంగాధర్‌రావు తెలిపారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.160
రెండోరకం	రూ.70	రూ.108



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 873 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	330	475
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 415.73 కిలోలు

న్యూస్‌రీల్

మనులో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. మంగళవారం కళాశాలలో అడ్మిషన్ల పోస్టర్స్‌ను ఆయన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో మే 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్లికేషన్స్ నింపుతామన్నారు. ప్రవేశ రాత పరీక్ష జూన్ 21 మధ్యాహ్నం కడప సెంటర్‌లో ఉంటుందన్నారు. అబ్బాయిలకు అప్లికేషన్ రుసుం రూ. 550, అమ్మాయిలకు రూ. 350 చెల్లించాలన్నారు. వివరాలకు 93980 83058 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో డీఎస్సీ 1998లో ఎస్‌జీటీగా క్వాలిఫై అయి మినిమం టైం స్కేల్ కింద పనిచేయుటకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై ఉద్యోగానికి జాయిన్ కాని వారి స్థానాలకు నేడు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. అలాంటి పోస్టులు జిల్లాలో 14 ఉన్నా యని తెలిపారు. ఈ 14 నాన్ జాయినింగ్ ఖాళీల భర్తీ కోసం నిర్వహించే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు తప్పక హాజరుకావాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలోని తదుపరి అభ్యర్థుల జాబితా www.kadapadoe.in లో పొందుపరిచినట్లు డీఈఓ తెలిపారు. జాబితాలోని అభ్యర్థులు 17న కడపలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

ఏపీ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప జిల్లాలో ఏపీ ఆర్‌ఈఐ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కడప (మైనారిటీ బాలురు), వేంపల్లి (మైనారిటీ బాలికలు) గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో అన్ని సీట్లకు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు ముస్లిం, దూదేకుల మైనారిటీ విద్యార్థిని, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మైనారిటీ గురుకుల పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ అబ్దుల్ రసూల్ తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తు దారులు ఆన్‌లైన్ https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తును పాఠశాల ప్రిన్సిపాల్‌కు స్వయంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా సమర్పించాలని తెలిపారు. వివరాలకు 7780179446, 97011 33148 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రతిష్టాత్మకంగా లైఫ్ కార్యక్రమం

బి.కొత్తకోట: పర్యావరణహిత జీవనశైలి కోసం చేపట్టిన లైఫ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్నామని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఎస్.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీ సముదాయంలో లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలోని చెత్త, ప్లాస్టిక్‌ను స్వయంగా తొలగించి పరిశుభ్ర పనులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ఇబ్బంది కలగని అంశాలపై ప్రజలకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అన్నమయ్య, శ్రీపుట్టపర్తి, అనంతపురంజిల్లాల్లో దీనికోసం ప్రత్యేకంగా రూపొందించిన అంశాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఏఏ అంశాలు పర్యావరణానికి విఘాతం కలిగిస్తాయి, ఏఏ అంశాలు పర్యావరణ హితం తెలిపేలా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, బీటు, సహాయ బీటు అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్‌గా అనిల్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన గతంలో 2020 ఆగష్టు 1 నుంచి 2021 ఆగష్టు 16 వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా విధులను నిర్వహించారు. అనంతరం పదోన్నతిపై అడిషనల్ డైరెక్టర్ (మాతా శిశు సంరక్షణ)గా అమరావతిలో విధులను చేపడుతున్నారు. తాజాగా ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా కడపకు వస్తున్నారు. కాగా ఇక్కడ ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా, మాతృ సంస్థ జోనల్ మలేరియా అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కోటేశ్వరి అడిషనల్ డైరెక్టర్ (ఎయిడ్స్ అండ్ లెప్రసీ)గా పదోన్నతి లభించడంతో అమరావతికి వెళుతున్నారు.

ఇన్‌చార్జ్ జడ్‌ఎంఓగా డాక్టర్ నాగరాజు...
జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కోటేశ్వరికి అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించడంతో ఇన్‌ఛార్జ్ జోనల్ మలేరియా అధికారి (జడ్‌ఎంఓ)గా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు నియమితులయ్యారు. కాగా ఆయన ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్‌ఓగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

క్రూ సెంటర్ క్లోజ్

- నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్‌కు ఘన చరిత్ర
- వచ్చేనెల 6 నాటికి డెడ్‌లైన్
- తట్టా..బుట్టా సర్దుకుంటున్న లోకో ఫైలెట్లు
- ఇక గూడ్స్‌రైళ్లు కూడా ఆగవు
- సదరన్ రైల్వేలో 'నందలూరు'ప్రత్యేక గుర్తింపు



ఒకప్పటి నందలూరు రైల్వేకేంద్రం


గూడ్స్‌రైళ్లతో రద్దీగా ఉన్న రైల్వే కేంద్రం

నందలూరు (రాజంపేట): బ్రిటీషు రైల్వే పాలకుల నుంచి కొనసాగిన ఎంతో ఘన చరిత్ర కలిగిన నందలూరు రైల్వే రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ (మిగిలిన ఏకైక డిపార్టుమెంట్) ఎత్తివేతకు డెడ్‌లైన్ విధించారు. ముందుగా నందలూరుకు మోడర్ రన్నింగ్‌రూం కోటి వ్యయంతో మంజూరు చేశారు. దానిని అర్ధాంతరంగా రద్దుచేశారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రన్నింగ్‌స్టాఫ్ డిపో ఏర్పాటు అనుకూలం కాదని చెబుతున్నా గుంతకల్ రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకోలేదని.. వారి అనాలోచిత నిర్ణయాలతో నందలూరు డిపోకు మంగళం పాడారని రైల్వే కార్మిక వర్గాలు చర్చించుకుంటున్నాయి.

6న క్రూసెంటర్ క్లోజ్..
వచ్చేనెల 6న రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్‌ను క్లోజ్ చేయనున్నారు. ఈ మేరకు సంబంధితశాఖ అధికారులకు గుంతకల్ నుంచి సంకేతాలు కూడా వచ్చేశాయి. ఇప్పటికే దశలవారీగా లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు, గార్డులను గుంతకల్ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసుకున్న డిపోకు తరలించారు. ఇక పూర్తి స్థాయిలో నందలూరు క్రూ సెంటర్‌ను మూసేసేందుకు రంగంసిద్ధం చేశారు.
– రన్నింగ్‌స్టాఫ్ సిబ్బందిని ఇప్పటికే గుంతకల్ రైల్వే ఉన్నతాధికారులు ఎర్రగుంట్ల డిపోకు వెళ్లేలా మానసికంగా సిద్ధం చేశారు. వచ్చే నెల 6 నాటికి నందలూరులో క్లోజ్ చేయనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి లోకోపైలెట్లు, ఏఎల్‌పీ, గూడ్స్‌గార్డులు తట్టాబుట్టా సర్దుకుంటున్నారు. దీంతో నాగిరెడ్డిపల్లె అర్బన్ పంచాయతీలో అద్దె ఇళ్లను ఖాళీ చేసుకుంటున్నారు. ఎర్రగుంట్లల్లో నివాసం ఉండలేమని వారు అంటున్నారు. కాలుష్యం లేని, తాగునీటి వసతి తదితర సమస్యలు లేని సమీప నగరాల్లో ఉండేందుకు అద్దె ఇళ్లను అన్వేషించుకుంటున్నారు.

నాలుగేళ్లలో..
ఆది నుంచి ఒక పథకం ప్రకారం నందలూరు రైల్వే కేంద్రాన్ని బీజేపీ సర్కారు నిర్వీర్యం చేసుకుంటూ వస్తోందని రైల్వే వర్గాల్లో చర్చ సాగుతోంది. క్రూ సెంటర్ క్లోజ్ నేపథ్యంలో ఆ పార్టీకి రాజంపేట, నందలూరు ప్రాంతీయుల్లో వ్యతిరేకత పెల్లుబుకుతోంది. హోల్డింగ్, ఉన్న డిపార్టుమెంట్‌లను ఎత్తివేయడం తదితర వాటిని రైల్వే చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ నందలూరు రైల్వే వైభవం కోల్పోవడానికి నాంది పలికిందని.. ఇప్పుడు బీజేపీ పాలనలో పూర్తిగా గత వైభవంను క్లోజ్ చేశారనే విమర్శలు వెలువడుతున్నాయి.

170 ఏళ్ల తర్వాత నిర్వీర్యం దిశగా నందలూరు..
దక్షిణమధ్య రైల్వే చరిత్రలో గుంతకల్‌కు రైలుమార్గంలేని రోజులలోనే నందలూరుకు రైల్వేమార్గం ఉండేది. సదరన్ రైల్వే(తమిళనాడు)లో కీలక రైల్వే కేంద్రంగా విరాజిల్లింది. వేలాది మంది కార్మికులతో కళకళలాడింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వారు నందలూరులో నివాసాలు ఉండటంతో దేశవ్యాప్త కల్చర్ నందలూరులో కొనసాగింది. ఇప్పటి వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడంలేదు. ఇక గూడ్స్ రైళ్లు కూడా ఆగకుండా వెళ్లిపోనున్నాయి. ఈ నేపథ్యంలో రన్నింగ్‌రూం, రైల్వే హాస్పిటల్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఎలక్ట్రికల్, రైల్వే ఇనిస్టిట్యూట్ తదితర విభాగాలు కూడా క్లోజ్ కానున్నాయి. ఆ విధంగా 170 ఏళ్ల చరిత్ర కలిగిన నందలూరు బీజేపీ పాలనలో గ్రామీణ స్టేషన్‌గా అవతరించనున్నది.

రన్నింగ్‌స్టాఫ్ డిపో క్లోజ్ చేస్తే ..



నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ వచ్చేనెల 6న క్లోజ్ చేయనున్నారు. కళకళలాడే నందలూరు ఇక కళ తప్పనుంది. 170 ఏళ్ల రైల్వేచరిత్ర కాలగర్భంలో కలిసిపోతుంది. గంతకల్ రైల్వేడివిజన్ ఉన్నతాధికారులు నందలూరుపై కత్తికట్టి మరీ నిర్వీర్యం చేస్తున్నారని స్పష్టంగా కనిపిస్తోంది. ఇక నేరుగా రైల్వేబోర్డులో కదలిక తీసుకురావాలి. నందలూరు పూర్వవైభవం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంది.
– జంబు సూర్యనారాయణ, సర్పంచి, నాగిరెడ్డిపల్లె అర్బన్, నందలూరు

జిల్లాలో రైల్వే అంటే నందలూరు



జిల్లాలో రైల్వే అంటే నందలూరు.. నందలూరు అంటే రైల్వే అన్నట్లుగా కొనసాగింది. జిల్లాలో ఏ రైలు ఎక్కాలన్నా నందలూరుకు వచ్చేవారు. ఇప్పుడు ఏ రైలూ ఆగడం లేదు. ఉన్న విభాగాలను ఎత్తివేసే పరిస్థితులు నెలకొన్నాయి. నేడు నిర్వీర్యదిశగా పయనించడం బాధాకరం. నందలూరు రైల్వే కేంద్రానికి పూర్వవైభవానికి కలిసికట్టుగా కృషిచేయాలి.
– కమాల్‌బాష, రిటైర్డ్ లోకోపైలెట్, నందలూరు

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

రాయచోటి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని 27 మండలాలు, మూడు మున్సిపాలిటీలలో 102 వార్డు, గ్రామ వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల యువత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖాళీ వలంటీర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈనెల 18 నుండి 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 20 నుండి 26 వరకు దరఖాస్తుల పరిశీలన, 27, 28 తేదీలలో అర్హులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంపికైన వలంటీర్లకు 30వ తేదీన శిక్షణా తరగతులు, 31న నియామక ఉత్తర్వులను అందజేస్తామన్నారు.

దోమల నివారణతోనే వ్యాధులు దూరం


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్ : దోమల నివారణతోనే వ్యాధులకు దూరంగా వుండవచ్చునని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కొండయ్య అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది పురవీధులలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుండి బంగ్లా సర్కిల్ మీదుగా బస్టాండుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా మలేరియా నివారణా అధికారి వేణుగోపాల్ , జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయ చంద్ర, హెల్త్‌ఎడ్యుకేటర్ బలరామరాజు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డితో పాటు పలువురు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భగ్గుమన్న తెలుగు తమ్ముళ్ల విభేదాలు

- రసాభాసగా ఎన్‌టీఆర్ శత జయంతి వేడుకలు
- మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతుండగా డిస్‌ప్లే కట్
- తనను అవమానించారంటూ సభలో నుంచి వెళ్లిపోయిన మండిపల్లె
- గొడవలు జరగకుండా సర్దిచెప్పిన పోలీసులు
- చివర్లో జై బీసీఆర్... అంటూ చంగల్ రాయుడి వర్గీయుల కేకలు


మినీ మహానాడు వేదిక నుంచి బయటకు వెళ్లిపోతున్న మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి


సౌండ్ సిస్టమ్ వద్ద ఆపరేటర్‌తో వాగ్వాదం చేస్తున్న మండిపల్లె అనుచరులు

రాయచోటి టౌన్ : ఎన్‌టీఆర్ శతజయంతి వేడుకలలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రాయచోటిలో మంగళవారం నిర్వహించిన మినీ మహానాడులో ప్రారంభం నుంచే విభేదాలు బయట పడ్డాయి. ఈలలు, కేకలు, ఫర్నిచర్ ధ్వంసం, తోపులాటలు, తమ నాయకులకు అనుకూలంగా నినాదాలతో సమావేశం మొత్తం అట్టుడికింది. టీడీపీ నేతలు రమేష్‌రెడ్డి, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ బాబుల మధ్య నెలకొన్న అసంతృప్తి సెగలు కార్యకర్తల దూషణల పర్వంతో బయట పడ్డాయి. జిల్లాలోని ఆరు నియోజక వర్గాల నుంచి నేతల అనుయాయులు సమావేశానికి వచ్చారు. ఈ క్రమంలో రమేష్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ బాబు కూడా వేర్వేరుగా తమ అనుచరులతో చిన్నపాటి బల ప్రదర్శనకు దిగారు. మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పట్టణంలోని తన కార్యాలయం ఆవరణలో ప్రత్యేకంగా భోజనాలు ఏర్పాటు చేసుకొని టీడీపీ నేత గంటా నరహరితో కలసి మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. అప్పటికే వేదిక ప్రాంగణంలో తమ నాయకులకు మద్దతుగా పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండటంపై రమేష్‌కుమార్‌రెడ్డి మైకు ద్వారా వారించారు. అనంతరం సమావేశంలో మైక్ తీసుకొని మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో మైక్ మూగపోవడంతో పాటు సమావేశం పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లు ఆగిపోయాయి. దీంతో రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు అక్కడున్న సౌండ్ సిస్టమ్‌ను ధ్వంసం చేశారు. మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అలకపూని తన అనుయాయులతో కలసి మినీ మహానాడును బహిష్కరించారు. ఈ తోపులాటలో రమేష్‌రెడ్డి, ప్రసాద్ బాబు వర్గీయులు కూడా ఒకరికి ఒకరు తోడు కావడంతో నాయకుల మధ్య ఉన్న విభేదాలు బయట పడ్డాయి. ఆ ప్రాంగణం బయట ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవ సాగనీయకుండా సముదాయించారు. తిరిగి మండిపల్లె వేదికపైకి వెళ్లారు. కానీ గొడవ మాత్రం ఆగలేదు. ఇంతలో వేదిక పైన ఏమి జరిగిందో తెలియలేదు కానీ వేదికపై నుంచి రండిరా పోదాం రండి అంటూ మండిపల్లె కిందకు దిగి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. వేదికపై ఉన్న నాయకులు ఎవరూ ఆయనను వారించే ప్రయత్నం చేయలేదు. బయటే కొంత సేపున్న తరువాత తన అనుచరులతో కలసి రోడ్డు మార్గం ద్వారా తన కార్యాలయానికి వెళ్లారు. ఈ మధ్యలో ఆయన అభిమానులు మండిపల్లె నాయకత్వం వర్థిల్లాలంటూ కేకలు వేశారు. తరువాత నాయకులు అందరూ మాట్లాడారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మనస్పర్థలు ఉంటే చర్చించుకొని పరిష్కరించుకోవాలే కానీ ఇలాంటి వేదికలపై ప్రదర్శన చేయకూడదని సూచనలు చేశారు. అంతకు ముందుగా రాయచోటి నియోజక వర్గ ఇన్‌చార్జి రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలా ఎవరికి వారు బలప్రదర్శన ప్రదర్శించుకోవడానికి ఇది వేదిక కాదన్నారు. కార్యక్రమం పూర్తయిన తరువాత కిందకు అందరూ దిగిపోతున్న సమయంలో రాజంపేట ఇన్‌చార్జి బత్యాల చంగల్‌రాయుడు అనుచరులు ....జై బీసీఆర్....జైజై బీసీఆర్.... చంగల్ రాయుడి నాయకత్వం వర్థిల్లాలంటూ నినాదాలు చేస్తుంటే వేదికపై ఉన్న నాయకులు తలపట్టుకున్నారు.

జిల్లాకు తలమానికంగా క్రికెట్ స్టేడియం

- కలెక్టర్ గిరీషా పీఎస్


రాయచోటి సమీపంలో క్రికెట్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లా తలమానికంగా ఉండేలా క్రికెట్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శివారున నక్కలవాండ్లపల్లె సమీపంలో క్రికెట్ స్టేడియం భూమి చదును పనులను కలెక్టర్ పరిశీలించారు. క్రికెట్ మైదానంలో పిచ్ ఎక్కడ వస్తుంది వంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేడియం చుట్టూ ఫెన్సింగ్ పనులు కూడా త్వరగా మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. చేసే పనులన్నీ నాణ్యతతో మన్నికగా ఉండేలా చేపట్టాలన్నారు. సాధ్యమైనంత త్వరగా క్రికెట్ స్టేడియం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేడియంకు వచ్చేందుకు సమీపంలోని ప్రధాన రహదారులను కలిపేలా రోడ్డు నిర్మాణాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఇంచార్జ్ ఎస్ఈ సహదేవరెడ్డి, డీఈ సురేష్‌నాయక్, మునిసిపల్ కమిషనర్ గంగాధరరావు, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి
సంబేపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మోటకట్ల పంచాయతీ కేతంరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి వసతులపై ఆరాతీశారు. పిల్లలను కలెక్టర్ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఆంగ్లం, తెలుగులో వర్ణమాల తదితర వాటి గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, డీఎంహెచ్‌ఓ కొండయ్య, తహసీల్దార్ మహేశ్వరిబాయ్, ఎంపీడీఓ నరసింహులు పాల్గొన్నారు.

కాన్పుల సంఖ్య పెరగాలి
కాన్పుల సంఖ్య గణనీయంగా పెంచాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం సంబేపల్లె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఓపీతో పాటు కాన్పుల సంఖ్య పెంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ల్యాబ్, మందుల గది, రోగుల గదులను ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యంపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు.

నాడు– నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి
నాడు– నేడు పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులు పక్కా నాణ్యతతో జరగాలని కలెక్టర్ అన్నారు. మంగళవారం మండలంలోని దుద్యాల పంచాయతీ పెద్దజంగంపల్లెలో ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌ను మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాసుదేవరెడ్డిలు సన్మానించి పలు అభివృద్ధి పనులపై వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, డీఈఓ పురుషోత్తం, డీఎంహెచ్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.

పేద పిల్లలకు ప్రైవేటు చదువు



చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు బుక్కా రుషిత. తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా. తండ్రి బి.బావా నాయక్ రైతు. ఒక్కగానొక్క కూతురు చదువుపై బెంగగా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం చిన్నారికి వరంగా మారింది. రుషితకు ప్రైవేటు స్కూల్‌లో చేర్పించేదుకు ప్రభుత్వ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోగా మదనపల్లెలోని చైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో సీటు దక్కింది. ప్రభుత్వ మేలును ఎన్నటికీ మరువని బావానాయక్ హర్షం వ్యక్తం చేశారు.

- కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య
- తొలి విడతలో 741 మందికి ప్రవేశాలు

మదనపల్లె సిటీ: ఒకప్పుడు ఉన్నత వర్గాల పిల్లలకే కార్పొరేట్, ప్రైవేటు విద్య అందేది. అయితే రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలతో కార్పొరేట్ విద్య అందరి హక్కుగా మారింది. రాష్ట్రంలో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలోని 25 శాతం సీట్లు పేద పిల్లలకు దక్కుతున్నాయి. మొదటి విడతలో 741 మందిని కార్పొరేట్,ప్రైవేటు స్కూళ్లకు ఎంపిక చేశారు.

అడ్మిషన్లు: జిల్లా పరిధిలోని 30 మండలాల్లో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత నిర్బంధ విద్యను అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొదటి విడతలో భాగంగా ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు పరిశీలించి 741 మందిని అర్హులుగా గుర్తించి లాటరీ ద్వార వివిధ పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు.



రిజర్వేషన్ అమలు ఇలా...
ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించే క్రమంలో అడ్మిషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం రిజర్వేషన్ అమలు చేస్తోంది. 10 శాతం ఎస్సీలకు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ,ఈబీసీలకు 6 శాతం సీట్లు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓసీల్లో వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల కంటే తక్కువ, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల కంటే తక్కువ ఆదాయం వారు రిజర్వేషన్‌కు అర్హులుగా నిర్ధారించారు.

మొత్తం సీట్లు : **3187**
ఎంపిక చేసిన సీట్లు : **930**
అడ్మిషన్ అయిన సీట్లు : **741**

'అమ్మ ఒడి ద్వారా ఫీజుల చెల్లింపు
ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలో ప్రభుత్వ సిఫార్సుల మేరకు 1వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అమ్మ ఒడి పథకం ద్వారా నిర్ధారించిన మేరకు ఫీజును ప్రభుత్వమే చెల్లించనుంది. దీంతో విద్యార్థులు పైసా కూడా పాఠశాలకు చెల్లించకుండా ఉచితంగా విద్య పొందవచ్చు. అయితే ఈ విద్యార్థుల నుంచి ఎంత ఫీజు వసూలు చేయాలి అనే దానిపై ఇప్పటికే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. కాగా రెండో విడత అర్హుల జాబితాను ఈ నెల 24 నుంచి 28 వరకు లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేస్తోంది. పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను పొందే అవకాశం కల్పించింది. రెండో విడతలో విద్యార్థులను త్వరలో ఎంపిక చేస్తాం. – పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

పెద్దమండ్యం : విద్యుత్ మోటారు సరఫరా కోసం అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, రాగి వైరు చోరీ చేసినట్లు ఓ రైతు స్థానిక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. రైతు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన కరీముల్లా గ్రామానికి సమీపంలోని తన పొలంలో వ్యవసాయ బోరు వేసుకొని పంటలు సాగు చేసుకుంటున్నాడు. మోటారుకు విద్యుత్ సరఫరా కోసం అమర్చిన 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, రాగి వైరు చోరీ చేశారు. అలాగే కేబుల్‌వైరు, స్టార్టర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని రైతు స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

సంబేపల్లె : విద్యుత్ షాక్‌తో రెండు గొర్రెలు, పొట్టేలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రౌతుకుంట పంచాయతీ బాటవారిపల్లెలోని నరసింహారెడ్డికి చెందిన గొర్రెల మందను రోడ్డుపక్కనే ఉన్న గొర్లదొడ్డిలో తోలారు. ఈ క్రమంలో దేవపట్ల సబ్‌స్టేషన్ నుంచి పోతువాండ్లపల్లెకు విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ విద్యుత్ తీగ తెగి గొర్రెలపై పడింది. దీంతో మందలో ఉన్న రెండు గొర్రెలు, ఒక పొట్టేలు అక్కడికక్కడే మృతి చెందాయి.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

సంబేపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయాల పాలయ్యారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై బావులకాడపల్లె క్రాస్ వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. చిత్తూరు జిల్లా బటమ్‌దొడ్డి మండలం కరసనపల్లెకు చెందిన రవి ద్విచక్రవాహనంలో గంగిరెడ్డిగారిపల్లె నుంచి కలకడ వైపు వెళ్తున్నాడు. రాయచోటికి చెందిన నరేష్ సొంత పనుల నిమిత్తం చిత్తూరు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో రాయచోటికి వస్తున్నాడు. మార్గంమధ్యలో వీరి వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారిద్దరికీ గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా పీలేరు ఆసుపత్రికి తరలించారు.

బొలెరో పికప్ ఢీకొని..

కలకడ : బొలెరో పికప్ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సంబేపల్లె మండలం గుట్టపల్లెకు చెందిన చంద్రయ్య కుమారుడు ఈశ్వరయ్య తన ద్విచక్రవాహనంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ నుంచి గుట్టపల్లెకు వెళ్తుండగా.. రాయచోటి నుంచి కలకడ వైపు టమాట లోడుతో బొలెరో పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వరయ్యకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాజరికానికి దర్పణం.. చరిత్రకు సాక్ష్యం

- గుర్రంకొండ కోట.. విశేషాల కలబోత
- అన్నమయ్య జిల్లాకు మణిహారం
- కర్ణాటక నుంచీ పర్యాటకుల రాక

గుర్రంకొండ : వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు చూడదగిన చారిత్రాత్మక ప్రదేశం గుర్రంకొండ కోట. రాచరికానికి, నవాబులు, బ్రిటిష్ వారి పాలనకు నిలువుటద్దంగా నిలుస్తోంది. అన్నమయ్య జిల్లాకు నడిబొడ్డున మణిహారంలా విరాజిల్లుతోంది. 14వ శతాబ్దం నుంచి ఈ కోటను పలు వంశాలకు చెందిన రాజులు, నవాబులు పాలించారు. 200 ఏళ్ల పాటు రాచరిక పాలనా వ్యవస్థకు కేంద్రంగా, జాగీరుగా, వ్యాపార వాణిజ్యాలకు, జమిందార్ల నిలయంగా ఉండేది. ముఖ్యంగా కడప నవాబు పాలనలో పేరుగాంచింది. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి దేవాలయాలు ఉన్నాయి. మైసూరు రాజు టిప్పుసుల్తాన్ బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే గడిచింది. చివరగా బ్రిటిష వారితో ఇక్కడ రాజరిక పాలనకు తెరపడింది. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన ఈ కోటలో ఎన్నో విశేషాలు, చూడదగిన ప్రదేశాలు, ఎంతో ఆకట్టుకునే కట్టడాలు ఉన్నాయి. దీని మొత్తం విస్తీర్ణం 700 ఎకరాలు ఉంటుంది. దీన్ని తిలకించడానికి మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు.

కోట ముఖద్వారం

గుర్రకొండను రాజులు పరిపాలించే కాలంలో కొండ చుట్టూ కోటగోడలను నిర్మించారు. కోటగోడల చుట్టూ కందకాలు తవ్వారు. ఈ కందకాల్లో నీటిని నింపేవారు. శత్రువులు కోటగోడలు ఎక్కకుండా.. ఆ నీటిలో మొసళ్లను వదిలేవారు. అలాంటి కోటకు ముఖద్వారాన్ని నిర్మించారు. ఈ ద్వారం నుంచే ఎవరైనా లోపలికి ప్రవేశించే వారు.

యూసూఫ్ సాహెబ్ తకియా




టిప్పుసుల్తాన్ చదవుకున్న పాఠశాల యూసుఫ్‌సాహెబ్ తకియా

గుర్రంకొండ పాలకులు టిప్పుసుల్తాన్ చదవుకొన్న పాఠశాలే యూసూఫ్‌సాహెబ్ తకియా, (తకియా అంటే పార్సీ భాషలో పాఠశాల అని అర్థం). అందరితోపాటు టిప్పుసుల్తాన్ తన గురువు షాకమాల్ దగ్గర ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొన్నాడు. గుర్రంకొండ పట్టణంలోని షాకమాల్ దర్గా పక్కనే ఈ పురాతన పాఠశాల భవనం ఉంది.

షాకమాల్ దర్గా

మైసూరు పాలకులు, అప్పటి గుర్రంకొండ కోట పాలకులు అయిన టిప్పు సుల్తాన్ ఆస్థాన గురువు షాకమాల్ దువ్వమ్. ఆయన ఈజిప్టు దేశం నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు చరిత్ర చెబుతోంది. ఆయన గొప్పతనం విన్న అప్పటి మైసూర్ పాలకులు హైదరాలీ తన కుమారుడు టిప్పుసుల్తాన్‌ను గుర్రంకొండలోని అతని మేనమామ మీర్‌రజా ఆలీఖాన్ వద్ద ఉంచి షాకమాల్ దగ్గర విద్యాబుద్ధులు నేర్పించారు. తదనంతర కాలంలో షాకమాల్ దువ్వమ్‌ను టిప్పుసుల్తాన్ గురువుగా నియమించారు. షాకమాల్ సమాధినే ఇక్కడ గొప్ప దర్గాగా ప్రజలు కొలుస్తారు. ఇది గుర్రంకొండ పట్టణంలో ఉంది.



గుర్రంకొండ కోట ముఖ చిత్రం

షాహజాదీ మసీదు

టిప్పు సుల్తాన్ కాలంలో రాజవంశీయుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మసీదు ఇది. పూర్తిగా రాతితోనే నిర్మించడం దీని ప్రత్యేకత. ఎక్కడా కూడా ఇతర నిర్మాణ వస్తువులు (ఇసుక, సిమెంటు, కంకర) లాంటివి వినియోగించకుండా పూర్తి స్థాయిలో రాతితోనే నిర్మించారు. ప్రస్తుతం దీన్ని ఆధునికీకరించారు. ఇలాంటివి కోట పరిసరాల్లో మరో రెండు ఉన్నాయి.

ఇంకా చూడదగిన విశేషాలు

- కొండపైన కోట బురుజులు, పురాతన కట్టడాలు, పురాతన ఇళ్లు ఉన్నాయి. అక్కడికి చేరుకోవడానికి మెట్లమార్గం కూడా ఉంది.
- కోటలో శిథిలావస్థకు చేరుకొన్న అలనాటి ఆస్పత్రి భవనం ఉంది.
- శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, టిప్పుసుల్తాన్ కాలం నాటి ఈద్గాలు ఉన్నాయి.
- కోట నుంచి పది కిలోమీటర్ల దూరంలో తరిగొండ గ్రామంలో ప్రముఖ రచయిత్రి తరిగొండ వెంగమాంబ ఆలయం ఉంది.
- కోట నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో సంతాన ప్రదాయిని చెర్లోపల్లె శ్రీ రెడ్డెమ్మకొండ దేవాలయం ఉంది.
- వీటితోపాటు ఇంకా ఎన్నో విశేషాలు గుర్రంకొండ కోటలో చూడవచ్చు.

ఇలా వెళ్లొచ్చు

- అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో 38 కిలోమీటర్ల దూరంలో కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ఉంది.
- తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో వాల్మీకిపురంలో దిగాలి. అక్కడి నుంచి గుర్రంకొండ 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇదే మార్గంలోనే తరిగొండ వెంగమాంబ ఆలయమున్న తరిగొండ గ్రామం ఉంది.
- తిరుపతి నుంచి నేరుగా అయితే 110 కిలోమీటర్ల దూరం ఉంటుంది.
- చిత్తూరు నుంచి నేరుగా అయితే 125 కిలోమీటర్ల దూరం ఉంటుంది.
- మదనపల్లె నుంచి కడపకు వెళ్లే మార్గంలో అయితే మదనపల్లె నుంచి 33 కిలోమీటర్ల దూరం ఉంటుంది.



కోట ముఖద్వారం

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం



శ్రీకృష్ణదేవరాయులు నిర్మించిన శ్రీ నరసింహస్వామి దేవాలయం

గుర్రంకొండ కోటను విజయనగర రాజులు పాలించే కాలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అప్పటి పాలకులు శ్రీకృష్ణ దేవరాయులు కోటలోని కొండపైభాగంలో నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. రంగిన్ మహల్‌కు దగ్గరలో కొండపైకి చేరుకునే మార్గంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. శిల్పకళా సౌందర్యంతో స్తంభాలు ఇట్టే ఆకట్టుకొంటాయి. అన్ని దేవాలయాలు తూర్పు ముఖంగా నిర్మిస్తే.. దీన్ని పశ్చిమముఖంగా కట్టడం విశేషం. ఇక్కడి నుంచి చూస్తే గుర్రంకొండ పట్టణంతోపాటు పరిసర గ్రామాల పచ్చటి పొలాలు, రాయల కాలం నాటి చెరువులు కనిపిస్తాయి.

మగ్బీరా

కోట పక్కనే మగ్బీరా ఉంది. పురాతన మహమ్మదీయుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కట్టడం ఇది. మగ్బీరా అంటే సమాధి. గుర్రంకొండ కోటను టిప్పుసుల్తాన్ మేనమామ మీర్‌రజాఆలీఖాన్ పాలించే వారు. ఆయన మృతి చెందిన తరువాత సమాధిని మగ్బీరాగా నిర్మించారు. ఇక్కడి డూమ్‌లో చేసే శబ్దాలు ప్రతిధ్వనించడం (రీసౌండ్) విశేషం.



మీర్ రజాఆలీఖాన్ సమాధి మగ్బీరా

రంగిన్‌మహల్



రంగిన్‌మహల్ ముందు వైపు నుంచి కనిపిస్తున్న రెండు అంతస్తులు

గుర్రంకొండ కోటలో చూడదగిన ముఖ్య ప్రదేశం రంగిణీ మహల్. ఎంతో పురాతన రాజభవనం ఇది. ముందు వైపు నుంచి రెండు అంతస్తులుగానూ, వెనకవైపు నుంచి మూడు అంతస్తులుగాను కనిపించడం దీని ప్రత్యేకత. ఎన్నో గదులు, ఓ గదిలో భవనం లోపలి నుంచి సొరంగ మార్గం ఉంది. శత్రురాజులు దండెత్తినప్పుడు ఈ మార్గం గుండా కోట బయటకు వెళ్లేందుకు ఈ సొరంగం ఒక మార్గంగా ఉండేది. పురాతన మెట్లు, సమావేశపు గదులు ఉన్నాయి.



వెనుకవైపు నుంచి కనిపిస్తున్న మూడు అంతస్తులు

చేపల వేటకు వెళ్లి మృత్యువాత

మృతుడు కర్ణాటక వాసి

మదనపల్లె : చేపల వేటకు వెళ్లి కర్ణాటక వాసి నీటమునిగి మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన శంకర (48) గ్రామాలకు వెళ్లి జ్యోతిష్యం చెబుతూ జీవించే వాడు. మదనపల్లె పట్టణం రామారావుకాలనీకి చెందిన శ్రీనివాసులు (38) అనంతపురం జిల్లా హిందూపురం బోయపేటకు చెందిన నంజుండప్ప (55) గ్రామాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి మిక్సీ, గ్యాస్టౌవ్ రిపేర్లు చేస్తూ జీవిస్తున్నారు. మంగళవారం వీరు ముగ్గురు మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీ అడవిలోపల్లె గ్రామంలో ఉపాధి రీత్యా వెళ్లి కలుసుకున్నారు. అనంతరం ముగ్గురూ కలిసి స్థానికంగా ఉన్న నడించెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చెరువులో వల వేసి చేపలు పడేంత వరకు ఈత కొట్టాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ముగ్గురూ చెరువులోకి దిగారు. అయితే గతంలో చెరువులో ఉపాధి హామీ పనుల్లో గుంతలు తీయడంతో లోతు ఎక్కువై కర్ణాటక వాసి శంకర నీటమునిగిపోయాడు. అతని కోసం శ్రీనివాసులు, నంజుండప్ప చెరువులో వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో స్థానికుల సహాయంతో మరోసారి వెతికినా ఫలితం కనిపించలేదు. దీంతో వారు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. అయితే అప్పటికే చీకటి పడటంతో మృతదేహాన్ని వెతికేందుకు సాధ్యపడలేదు. దీంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీయనున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.


ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐ

పీలేరు : పీలేరు పరిసర ప్రాంతాలలో బైక్‌ల దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మోహన్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, నిందితులను హాజరు పరిచారు. సీఐ వెల్లడించిన వివరాలిలా వున్నాయి. కలికిరి మండలానికి చెందిన దేరంగుల శివ, మేడికుర్తి సందీప్ కుమార్ కొంత కాలంగా పీలేరు, పరిసర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను చోరీ చేసే వారు. వారిని మంగళవారం అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే డ్రోన్ యంత్రం మాయం



డ్రోన్ యంత్రం మాయమైన సిగలబోటు కొండ

గుర్రంకొండ : భూములు సర్వే చేస్తున్న డ్రోన్ యంత్రం మాయం అయింది. దాని కోసం అధికారులు రెండు రోజులుగా కొండల్లో గాలిస్తున్నారు. ఈ సంఘటన మండలంలోని టి.పసలవాండ్లలో చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో డ్రోన్ సర్వే చేయాడానికి గానూ అధికారులు ఈ నెల 15న అన్ని ఏర్పాట్లు చేశారు. పంచాయతీ పరిధిలోని కామన్నగారిపల్లెలో అదే రోజు ఉదయం 11 గంటలకు లాంఛనంగా డ్రోన్ సర్వేను ప్రారంభించారు. 12 గంటల వరకు డ్రోన్ యంత్రం పని చేసింది. అయితే గంట సమయం తరువాత ఉన్నట్టుండి గ్రామాలకు దక్షిణం వైపు ఉన్న సిగలబోటు కొండ వైపు దూసుకెళ్లింది. ఏం చేయాలో తెలియక అధికారులు, సిబ్బంది దాని కోసం విశ్వప్రయత్నం చేశారు. అయితే అదుపు తప్పి డ్రోన్ యంత్రం కొండల వైపు దూసుకెళ్లి ఎక్కడో పడిపోయింది. అయితే కొండ మొత్తం పెద్ద ఎత్తున బండలు, కంపలు ఉండడంతో అధికారులు, సిబ్బంది నానా కష్టాలు పడుతున్నారు. రెండు రోజులుగా కొండల్లో తిరుగుతూ డ్రోన్ యంత్రాన్ని కనిపెట్టే పనిలో ఉన్నారు. మాయమైన డ్రోన్ విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. మంగళవారం సాయంకాలం వరకు జాడ కనిపించలేదు. ఈ విషయమై మండల సర్వేయర్ రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా.. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు డ్రోన్ యంత్రం కొండలవైపు వెళ్లిపోయిందన్నారు. రెండు రోజులుగా తమ సిబ్బంది, ఇతర అధికారులు గాలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా



మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్‌రావు

రైల్వేకోడూరు : జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృక్ష సంపద పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలపై నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, దిశ పోలీస్‌స్టేషన్ అండగా నిలవాలని సూచించారు. ఏ కేసులు ఏ కోర్టుల పరిధిలో ట్రయల్ జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కేసుల తీవ్రతను బట్టి త్వరితగతిన పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. కేసుల విచారణకు చేపట్టాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర ఉల్లంఘనలపై నమోదైన కేసులను సమీక్ష చేశారు. రౌడీల కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఉక్కుపాదం మోపాలని సూచించారు. అంతకుముందు ఎస్పీ గంగాధర్ రావుకు డీఎస్పీ చైతన్య, ఎస్సైలు మోహన్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లి/కురబలకోట : తమ్ముడి హత్య కేసులో అన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కురబలకోట మండలం కన్నసానివారిపల్లె పంచాయతీ గుణుకుంట్లవారిపల్లెకు చెందిన సి.గదాధర, సి.ప్రహ్లాద, సి.విశ్వామిత్ర అన్నదమ్ములు. వీరిలో ప్రహ్లాద, విశ్వామిత్రకు ఇంటి జాగా విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. దీనికి సంబంధించి 2023 మార్చిలో మదనపల్లె కోర్టులో తీర్పు తనకు అనుకూలంగా వచ్చిందని అన్న ప్రహ్లాద ఖాళీ స్థలంలో ఎద్దులు కట్టేందుకు ప్రయత్నించడంతో.. ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. తర్వాత ప్రహ్లాద ఇంటి ముందర కావాలనే అన్న గదాధర ఇంటికి వెళ్లేందుకు అడ్డుగా దారి లేకుండా కర్రలు వేయడంతో వచ్చి పోయేందుకు కర్రలు తొలగించేందుకు విశ్వనాథ ప్రయత్నించాడు. దీంతో ప్రహ్లాద తాను వేసిన కర్రలను తొలగిస్తావా అంటూ తమ్ముడని కూడా చూడకుండా విశ్వామిత్రపై చచ్చిపోతాడని తెలిసి ఉద్దేశ పూర్వకంగానే కర్ర తీసుకుని తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడు విశ్వామిత్రను అన్న గదాధర జిల్లా ఆస్పత్రికి తరలించి, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలో చేర్పించారు. ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో అన్న గదాధర ఫిర్యాదుమేరకు రెండోతమ్ముడు ప్రహ్లాదపై సెక్షన్ 324 ఐపీసీ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈక్రమంలో తిరుపతిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం విశ్వామిత్ర మృతి చెందాడు. దీంతో పోలీసులు హత్యాయత్నం కేసును సెక్షన్ 302 ఐపీసీ కింద హత్యకేసుగా మారుస్తూ ప్రహ్లాదను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంటి జాగా విషయమై తనకు అనుకూలంగా వచ్చిన కోర్టు తీర్పులో తిరిగి తమ్ముడు ఎక్కడ అప్పీల్‌కు వెళతాడేమోనన్న అనుమానంతో ఉద్దేశ పూర్వకంగానే తమ్ముడిపై అన్న హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోందని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ శివాంజనేయులు, ముదివేడు ఇన్‌చార్జి ఎస్ఐ రామమోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ పనులు నిలుపుదల చేయాలని ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు పంచాయతీ గుడ్డంపల్లి సమీపంలో ఉన్న గ్రానైట్ క్వారీ పనులను నిలుపుదల చేయాలని ఇదే పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు తలారీ వెంకటరమణమ్మ అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మాట్లాడుతూ క్వారీ ప్రాంతం నుంచి వచ్చే పేలుళ్ల శబ్దాలకు గృహాలు బీటలు బారుతున్నాయని, వ్యవసాయ బోర్లలోని పైపులు ఊడిపోతున్నాయన్నారు. తద్వారా ప్రజలంతా రాత్రి వేళ కంటి మీద కునుకు లేకుండా జాగారం చేయాల్సి వస్తోందన్నారు. క్వారీ పక్కనే ఉన్న తమ సొంత స్థలాన్ని కూడా క్వారీ లీజుదారులు ఆక్రమించారని, ఇదేమిటని ప్రశ్నిస్తే తమను చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. అంతేగాక తాము క్వారీ పనులను అడ్డుకుంటున్నామని ఆరోపిస్తూ క్వారీ లీజుదారులు తమపై కోర్టులో కేసు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమగ్రంగా విచారణ చేసి, క్వారీ పనులను రద్దు చేసి తమకు రక్షణ కల్పించాలని స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌కు, భూగర్భ గనుల శాఖ అధికారులకు, మండల తహసీల్దార్, స్థానిక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని ఆమె పేర్కొన్నారు.